క్లుప్తంగా

ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోండి

పుల్‌కల్(అందోల్): అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూమిని ఉన్నత అధికారులు విచారణ చేపట్టి స్వాధీనం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మాధూరి తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో 261 సర్వే నంబర్‌లోని భూమిని పేదల ఇళ్ల పట్టాల కోసం కేటాయించారు. అయితే సంబంధిత భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించగా బుధవారం అదనపు కలెక్టర్ మాధూరి గ్రామానికి వచ్చి భూ రికార్డులు పరిశీలించగా భూమి ఆక్రమణకు గురైందని తేలింది. ఆక్రమణకు గురైన భూమిలో సర్వేచేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



వర్మికంపోస్టు తయారీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

కంది(సంగారెడ్డి): తడి, పొడి చెత్తను వేరుచేసి వేసేలా ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఎద్దుమైలారం, కందిలో పర్యటించి డంపింగ్ యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, సర్పంచ్ విమలవీరేశం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి, నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి బుధవారం మండలంలోని దిడిగి తదితర గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభంలో తొలకరి వర్షాలు ఆలస్యం కావడంతో జులై నెలలో ఒకేసారి అధికవర్షం తిరిగి ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా పత్తి పంట ఎదుగుదల నిలిచిపోయిందన్నారు. ఇమిడాక్లోప్రియ 0.25 ఎంఎల్ లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు లేదా డైపెన్థయురాన్ 1.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెల్లదోమ నివారణకు మందుల పిచికారీతో పాటు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 చొప్పున అమర్చాలన్నారు. ఏడీఏ వెంట ఏఈఓ రాజు, రైతులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీ బాబు, వార్డుసభ్యులు నర్సింహ, ప్రసాద్‌చారి, మంగలి రవి తదితరులు బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పార్టీలో చేరినవారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి చర్యలు



పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను దశలవారీగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో బుధవారం యూజీడీ నిర్మాణ పనులకు రోజారాణి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత, నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం తహశీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్‌నారాయణ అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూలిప్పేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బీసీలను గుర్తించకపోవడం బాధాకరం

- పటాన్‌చెరు టికెట్‌పై సీఎం పునరాలోచించాలి
- బీసీ నేత నీలం మధు ముదిరాజ్‌కు అవకాశం కల్పించాలని బహుజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని, బీసీ వర్గం సీనియర్ నేత నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరుతూ ఇస్నాపూర్ నుంచి చౌరస్తా వరకు సబ్బండ వర్గాల నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల ఐక్యత వర్ధిల్లాలి, బీసీ వర్గాలకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ, బీసీలను తొక్కి పెడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో బీసీ కులాలైన ముదిరాజ్‌లు, నాయీబ్రాహ్మ, రజక ఇతర బీసీ కులాల వారికి సీట్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ బీఆర్ఎస్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన నీలం మధుకు టికెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి నీలం మధుకు టికెట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి చాకలి వెంకటేష్, చాకలి సంజీవ్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ గారెల శ్రీను ముదిరాజ్, లక్ష్మారెడ్డి, దానయ్య, వడ్డెర వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, గౌరిచారి, అనిల్, మురళియాదవ్ పాల్గొన్నారు.

ఎస్ఎంఆర్ యువసే నేతల అరెస్టులు

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ నీలం మధుకు కేటాయించకపోవటాన్ని వ్యతిరేకిస్తూ సీఎం కేసీఆర్‌ను అడ్డుకునేందుకు ఎన్ఎంఆర్ యువసేన నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు ముందస్తుగా ఎన్ఎంఆర్ యువసేన నాయకులను అరెస్టులు చేయగా అరెస్టులను నిరసిస్తూ జిన్నారంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీసీలకు అన్యాయం చేశారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాలో బీసీలకు అవకాశం కల్పించకపోవడం విచారకరమని ఎస్ఎంఆర్ యువసేన నాయకుడు తలారి మధుసూదన్ అన్నారు. బుధ వారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కు న్యాయం జరిగే వరకు తాము ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవిచారి, పాండు, సుభాష్, మన్నే వెంకటయ్య పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన గులాబీ శ్రేణులు



నారాయణఖేడ్: జెండా ఊపి వాహనశ్రేణిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సదాశివపేట: సభకు తరలివెళ్తున్న నాయకులు



జహీరాబాద్ టౌన్‌లో...



జిన్నారంలో..

మెదక్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు బుధవారం నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, పటాన్‌చెరు నియోజకవర్గాల నుంచి వివిధ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు.

– సంగారెడ్డి న్యూస్ డెస్క్

అంబరాన్నంటిన చంద్రయాన్ 3 విజయోత్సవం



జహీరాబాద్‌లో..



సంగారెడ్డి టౌన్‌లో..

పటాన్‌చెరు: చందమామ దక్షిణ ధ్రువంపై విజయవంతంగా చంద్రయాన్–3 ప్రయోగించి ఇస్రో శాస్త్రవేత్తలు దేశఖ్యాతిని ఇనుమడింపచేశారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాలకు చంద్రయాన్ 3 స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

జహీరాబాద్ టౌన్: చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బుధవారం బీజేపీ నాయకులు పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

చంద్రయాన్ విజయవంతంతో పూజలు

సంగారెడ్డి టౌన్: చంద్రాయన్ విజయవంతం కావడంతో సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు.

చంద్రాయన్ 3 విజయవంతంపై సంబరాలు

పటాన్‌చెరు: చంద్రాయన్ 3 విజయవంతం దేశ ప్రజల విజయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఇస్నాపూర్ చౌరస్తాలో చంద్రయాన్ 3 విజయవంతంపై సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో...

పటాన్‌చెరు పట్టణం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో చంద్రాయన్ 3 విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన జిన్నారం మండల పరిధిలోని గడపోతారంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంత్రికుంట గ్రామానికి చెందిన జంగం గారి శ్రీకాంత్ గాగిల్లాపూర్‌లోని వైన్‌షాపులో మద్యం సేవించి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టాటాఏసీ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను స్థానికులు అంబులెన్స్‌లో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ మండలంలోని ఇటికెపల్లి గ్రామానికి చెందిన మేతరి సంగయ్య(70) పనుల నిమిత్తం జహీరాబాద్ పట్టణానికి వచ్చి రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి జహీరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు సంగయ్యను ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పీఈటీ మృతి



రాజ్‌గోపాల్(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వావిలాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న రాజ్‌గోపాల్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎప్పటిలాగే రాజగోపాల్ బైక్‌పై పాఠశాలకు వెళ్తున్న సమయంలో గడ్డపోతారం రాగానే ఛాతిలో నొప్పి వస్తుందని పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందినవాడు. రాజ్‌గోపాల్ మృతిపై ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ రక్తదానం

సదాశివపేట(సంగారెడ్డి): రాజస్థాన్‌లోని మౌంట్‌ఆబు జాతీయ విద్యా, నైతిక, ఆధ్యాత్మిక, రాజయోగ మెడిటేషన్ జాతీయ సదస్సులో భాగంగా బుధవారం సదాశివపేట ఎంఈఓ దండు అంజయ్య 44వ సారి రక్తదానం చేసి ప్రశంసాపత్రం అందుకున్నారు. బ్రహ్మకుమారిస్ ప్రకాష్మణి 16వ స్మృతి దినోత్సవం సందర్భంగా 1000మంది రక్తదాతలతో రోటరీ ఇంటర్నేషనల్ గ్లోబల్ హస్పిటల్ బ్లడ్‌బ్యాంకు, బ్రహ్మకుమారీస్ సంస్థ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు.

◆ నారాయణఖేడ్ తహశీల్దార్‌గా దేవదాస్

నారాయణఖేడ్: ఖేడ్ తహశీల్దార్‌గా దేవదాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖేడ్ తహశీల్దార్‌గా ఇక్కడ విధులు నిర్వహించిన మురళీధర్‌ను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ జిల్లా నుంచి వెంకటలక్ష్మిని నియమించినప్పటికీ ఆమె బాధ్యతలు స్వీకరించలేదు. కాగా నల్గొండ జిల్లా నుంచి దేవదాస్ నియమించడంతో ఆయన బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

◆ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీహెచ్ఈఎల్ అధికార కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు తెలిపారు. బుధవారం బీహెచ్ఈఎల్ కార్మిక గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా బెల్ గాంధీ విగ్రహం వద్ద బుధవారం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన బీహెచ్ఈఎల్ కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో తనను గెలిపించిన కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీను, నాయకులు శ్రీనివాసరావు, సతీష్, మహేష్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ తెలంగాణలో బీజేపీదే అధికారం

కొండాపూర్(సంగారెడ్డి): రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్సీ అవినాష్‌సింగ్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆ పార్టీ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు విధాన్ సభ ప్రవాస్ యోజన వర్క్‌షాప్‌లో భాగంగా మండలంలోని మల్కాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతిజ్ఞకరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశ్‌పాండే, సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ రాములు పాల్గొన్నారు.

◆ కల్హేర్ తహసీల్దార్‌గా బాలశంకర్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ తహసీల్దార్ బాలశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన నాగేశ్వర్‌రావు కలెక్టరేట్ డిసెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన బాలశంకర్ ఇక్కడ పనిచేసిన నాగేశ్వర్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ప్రమోద్, సర్వేయర్ సునీత, సిబ్బంది ఆనంద్, తదితరులు బాలశంకర్, నాగేశ్వర్‌రావును సన్మానించారు.

◆ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీమాణిక్‌ప్రభు పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదివి 15 సంవత్సరాలు పూర్తి అయినందునా నాటి రోజులను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం పాఠశాల ఫౌండర్, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

◆ ఓటు వినియోగంపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద ఓటుహక్కు విలువను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ ఓటుహక్కును ప్రతిజ్ఞకరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శానిటేషన్ ఏఈ వినోద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జెండా ఊపి పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బుధవారం మేరు సంఘం వారి ఆధ్వర్యంలో విశ్వశాంతిని కోరుతూ శ్రీమాణిక్ ప్రభు ఆలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు నిర్వహించనున్న పాదయాత్రను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మేరు సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చంద్రశేఖర్, అరవింద్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

ఝరాసంగం(జహీరాబాద్): పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో సుజాత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా వన్ డే వన్ కోర్ లో గ్రామాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి తప్పనిసరిగా మొక్కలను నాటాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రెండు కమ్యూనిటీ ఇంకుడుగుంతలు తప్పనిసరిగా నిర్మించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా మురుగుకాలువలు శుభ్రం చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేష్

నారాయణఖేడ్: నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ఓటర్ల సంఖ్య పెంచాలని ఆర్డీఓ వెంకటేశ్ అన్నారు. మండలంలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఖేడ్, మనూరు మండలాల బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈ నెల 21న ప్రారంభమై వచ్చేనెల 19 వరకు నిర్వహించనున్న రెండో ప్రత్యేక సమ్మరీ రివిజన్ నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఓటరు నమోదు కోసం ఫాం–6 పూరించి సంబంధిత బీఎల్వోకు, తహసీల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఖేడ్ డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ రాజు, ఆయా మండలాల ఎంపీడీవోలు, గిర్దావర్లు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి అర్బన్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పంగారి రామిరెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని ఫంక్షన్ హాలులో బుధవారం రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెడ్ల ఆవేదన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ 2018లోనే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీమేరకు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోషరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలో ఆ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్‌లో జరిగే బహిరంగసభలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి రాష్ట్ర యువత వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, మేడ్చల్ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నిజాంబాద్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జేఆర్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించతలపెట్టిన జిల్లా రెడ్ల ఆవేదన సభకు సదాశివపేట పట్టణ, మండల రెడ్డి పరిహార్, రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

కాంగ్రెస్‌లో రాములు చేరిక

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ నుంచి బహిష్కరింపబడిన సీనియర్ నాయకులు, ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎంజీ రాములు తన అనుచరులతో కలిసి బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నవీన్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: వరకట్న వేధింపులపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ ప్రణీత్‌ప్రణవ్ హోమ్స్ కాలనీలో నివాసం ఉండే పండరిగౌడ్ కుమార్తె వాసవిని లింగంపల్లికి చెందిన కిషోర్‌గౌడకు నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. వివాహ సమయంలో రూ.25లక్షల నగదుతో పాటు 65 తులాల బంగారం, అరకిలో వెండి కట్న కానుకలుగా ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి అయిన నెల రోజుల నుంచి భర్త కిషోర్‌తో పాటు మామ యాదగిరిగౌడ్, అత్త ఉదయశ్రీ, ఆడపడుచు స్వాతి, మరిది కిరణ్‌గౌడ్ వేధింపులకు గురి చేస్తున్నారు. అదనంగా కట్నం తీసుకురావాలని కొట్టడం, వేధింపులకు గురి చేస్తున్నారని వాసవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరుగు పందెంలో సత్తాచాటిన ఏఈఓ

జహీరాబాద్ టౌన్: రాష్ట్రస్థాయి ఉద్యోగుల పరుగు పందెం పోటీల్లో మండలంలోని కోత్తూర్(బి) గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారి(ఏఈఓ) కోల రాజు సత్తచాటాడు. ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రాజు మొదటి స్థానంలో నిలిచాడు. ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికైయ్యాడు. పరుగు పందెం పోటీల్లో సత్తా చాటిన రాజును ఏడీఏ భిక్షపతి, ఏఈఓ అధికారులు అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో సంగారెడ్డిలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల వాల్‌పోస్టర్‌ను సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సాలోమాన్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషికి తోడుగా విద్యార్థులు, మేధావులు ప్లీనరీ సమావేశాలకు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల ముందస్తు అరెస్టులు



పటాన్‌చెరుటౌన్ : క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర కమిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురి నాయకులను ముందస్తుగా అరెస్టులు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపు విడుదల చేశారు.

– సంగారెడ్డి న్యూస్ డెస్క్